క్లుప్తంగా

నేడు డాక్టర్స్ డే

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో డాక్టర్స్ డే పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పొలిమేర వెంకటరెడ్డి ప్రారంభించారు. డాక్టర్ నవులూరి క్రాంతికుమార్ రెడ్డి రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. బీపీ, షుగర్, రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహించారు. తమ వైద్యశాల్లో కూడా అన్ని పరీక్షల్లో రాయితీలు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు బోడె సైదులు రెడ్డి, గంగా వీరారెడ్డి, దుద్దకుంట వెంకటరామిరెడ్డి, అజయ్‌బాబురెడ్డి, ఒరుకూటి కోటిరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాదెండ్ల: ఇర్లపాడు ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఇర్లపాడు, అమీన్‌సాహెబ్‌పాలెం, రాజుగారిపాలెం, బుక్కాపురం, ఎండుగుంపాలెం, గున్నావారిపాలెం గ్రామాలకు గృహ, వ్యవసాయ, వాణిజ్య అవసరాలకు విద్యుత్ సరఫరా నిలిచి పోతుందన్నారు.

విద్యార్థికి వినికిడి పరికరాలు అందజేత

శావల్యాపురం: ప్రత్యేక అవసరాలు కల్గిన బాలబాలికలను విద్య పరంగా ప్రతి ఒక్కరు ప్రోత్సహించాలని ఎంఈఓ పుసులూరి లలితా కుమారి అన్నారు. శుక్రవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో మండలంలోని పోట్లూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అందుగుల దివ్యభారతి రూ.15 వేలు విలువ చేసే వినికిడి యంత్ర పరికరాలు సమగ్ర శిక్షా అలింకో ఆధ్వర్యంలో మంజూరు చేసిన వాటిని ఎంఈఓ చేతుల మీదుగా అందజేసినట్లు భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు,భవిత సెంటరు సిబ్బంది పార్వతి పాల్గొన్నారు.

భోజన కంచాలు వితరణ

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నిమిత్తం 100 కంచాలను గణిత ఉపాధ్యాయులు యెండ్లూరి శ్రీనివాసరావు శుక్రవారం అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.ఉమా మహేశ్వరరావు, పేరెంట్ కమిటీ చైర్మన్ షేక్ అక్బర్, ఉపాధ్యాయులు కిషోరు బాబు, శ్రీనివాసరావు, సీఆర్‌పీ ఏలికా శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

నేడు బొడ్డురాయి వార్షికోత్సవం

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న సీతాలంబ తల్లి (బొడ్డురాయి) 13వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుండి అమ్మవారికి జలాభిషేకంతో ప్రారంభమై అలంకరణ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి. గతేడాది ఇప్పటి వరకూ అమ్మవారికి దాతలు సమర్పించిన చీరలను బహిరంగ వేలం నిర్వహించనున్నారు. అనంతరం ప్రసాదాల పంపిణీ చేయనున్నారు. అమ్మవారి దర్శనం కోసం కమిటీ సభ్యులు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో అలంకరించారు.

తొలి ఏకాదశి ఆదాయం రూ.9,71,880

వినుకొండ(నూజెండ్ల) : తొలి ఏకాదశి సందర్భంగా వినుకొండ రామలింగేశ్వరస్వామి ఆలయానికి దేవాదాయ శాఖకు రూ.9,71,880లు ఆదాయం వచ్చినట్లు దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కె.హనుమంతరావు తెలిపారు. స్వామివారి హుండీ ఆదాయం రూ.4,07,971లు, భక్తులు విరాళాల రూపంలో రూ.2,59,109, వేలం పాట రూపంలో రూ.3,04,800లు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీకి రూ.8 లక్షల ఆదాయం

వినుకొండటౌన్: తొలి ఏకాదశి శుభ సందర్భంగా కొండపై వేంచేసిన శ్రీ గంగాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి తిరునాళ్లను పురస్కరించుకొని ఘాట్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్సులను నడపడం ద్వారా ఆదాయం చేకూరిందని డిపో మేనేజర్ కోటేశ్వరనాయక్ తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, అల్ట్రా సర్వీసులను ఏర్పాటు చేయడం జరిగిందని, రాను పోను రూ.80లు టిక్కెట్ ధర నిర్ణయించడం జరిగిందన్నారు. ఆర్టీసీకి ఒక్క రోజులో సుమారు రూ.8.16 లక్షల ఆదాయం వచ్చిందని ఆయన వివరించారు.

నేటి నుంచి 'జగనన్న సురక్ష'



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు జాన్‌సైదులు

ఈపూరు : మండలంలో నేటి నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు శుక్రవారం తెలిపారు. అధికారులు రెండు టీంలుగా ఏర్పడి ఆయా సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించున్నట్లు తెలిపారు. జూలై 1న కొండ్రముట్ల, కొచ్చర్ల, 5న బొమ్మరాజుపల్లి, అంగలూరు, 7న అగ్నిగుండాల, ఈపూరు, 10న కొండాయపాలెం, ఇనుమెళ్ల, 14న ముప్పాళ్ల-1, చిట్టాపురం, 17న ముప్పాళ్ల-2, వనికుంట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నారు. టీమ్-1లో తహసీల్దార్ ఆర్. వెంకటేశ్వర్లునాయక్, ఈవోపీఆర్‌డీ జి. వెంకటేశ్వర్లు, ఆర్ఐ పి.పద్మలత, టీం-2లో ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు, ఏఎస్‌వో కె.నాగ శ్రీనివాసరావు, ఎస్ఏ సీహెచ్.వి. రవి సభ్యులుగా ఉంటారని వివరించారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ఆయా సచివాలయ పరిధిలో జూలై 1వ తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి. వెంకయ్య తెలిపారు. కమిషనర్ పి.వెంకయ్య, మేనేజర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు టీంలుగా ఏర్పడి సభ లు ఏర్పాటు చేయనున్నారని చెప్పారు. జూలై 1న లాయర్స్ స్ట్రీట్1, 2 సచివాలయాలు, 4న కొత్తపేట-1, 2, 7న శాలివాహన నగర్-1,2, 12న ఎస్ఎస్‌పీ కాలనీ-1,2, 18న కట్టకింద బజారు, ఓబయ్యకాలనీ, 22న హనుమాన్‌నగర్-1,2 సచివాలయాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు.

వినుకొండ రూరల్ మండలంలో....

మండలంలో జూలై 1న నరగాయపాలెం, 3న విఠంరాజుపల్లి -2, 5న పెదకంచర్ల, 7న తిమ్మాయపాలెం, 10న చీకటీగలపాలెం, 12న ఏనుగుపాలెం, 14న బ్రాహ్మణపల్లి, 17న అందుగులపాడు, 18న గోకనకొండ, 19న ఉప్పరపాలెం, 21న నాగులవరం, 24న నడిగడ్డ, 26న దొండపాడు, 27న పిట్టంబండ, 28న కొప్పుకొండ గ్రామాల్లో జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించనున్నారు.

శావల్యాపురంలో....

శావల్యాపురం: నేటి నుంచి గ్రామ సచివాలయాల వారీగా జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని తహసీల్దారు షేక్ జాన్‌సైదు లు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణ తీరుపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయంలో నేడు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ సచివాలయ పరిధిలో వలంటీర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అర్జీలు పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కనమర్లపూడి గ్రామసచివాలయ పరిధిలో 779 నివాస గృహాలు ఉండగా నేటి వరకు 579 గృహాలను వలంటీర్లు ఇంటింటి సర్వే చేసి 290 అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు చెప్పారు. ఎస్సీ, బీసీ కాలనీల్లోని వాసులు వలసలు వెళ్లటం వలన సర్వే కార్యక్రమం చేయలేకపోయారన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో సంక్షేమ పథకాలు, 11 రకాల ధ్రువీకరణ పత్రాల తదితర సమస్యలు ఉన్న వారందరూ సమగ్ర వివరాలు అర్జీ రూపంలో వలంటీర్లుకు అందజేస్తే సత్వరమే ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తదుపరి సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామమన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఈఏలు మూడవత్ ఆకాష్, రమేష్‌లు పాల్గొన్నారు.

టీడీపీ నిర్వాకం వల్లే అభివృద్ధికి దూరంగా విలీన గ్రామాలు

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: టీడీపీ చేసిన పాపం విలీన గ్రామాల పాలిట అభివృద్ధికి శాపంగా మారిందని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని విమర్శించారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండాలోని అంశాలు చదవడం పూర్తి అయ్యాక టీడీపీ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలకు ముందు పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు కొనసాగటం లేదని ఆరోపించారు. దీంతో చైర్మన్ రఫాని మాట్లా డుతూ గ్రామాల విలీనాన్ని వ్యతిరేకిస్తూ టీడీపీకి చెందిన వారు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో సంబంధిత గ్రామాలలో ఎలాంటి పనులు చేపట్టాలన్నా కోర్టు ఉత్తర్వులు అడ్డంకిగా మారాయని, ఈ పాపం టీడీపీ వారికే దక్కుతుందని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత వ్యాజ్యాలను ఉపసంహరించుకుంటే వెంటనే అభివృద్ధి పనులు వెంటనే చేపడతామని హితవు పలికారు. దీంతో టీడీపీ సభ్యులు కుక్కల బెడద అధికంగా ఉందని వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కలను పట్టి వధించటానికి కోర్టు ఉత్తర్వులు అడ్డుగా ఉన్నాయని, ఇదే విషయాన్ని పలుమార్లు చెప్పడం జరిగిందని చైర్మన్ వివరించారు. వార్డు కౌన్సిలర్లు, స్థానికులు సహకరిస్తే కుక్కలను పట్టి అడవుల్లో వదిలేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు మాట్లాడుతూ కుక్కలను పట్టి దూరప్రాంతాలలో వదలడంతో పాటు వాటి నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎజెండాలోని 85వ అంశమైన ఎన్ఆర్‌టీ రోడ్డులోని బైపాస్ రోడ్డు నిర్మాణ ప్రాంతంలో సీసీ కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలను టీడీపీ సభ్యులు వ్యతిరేకించారు. దీనికి మున్సిపల్ డీఈఈ తోట వెంకటరమణ మాట్లాడుతూ బైపాస్ నిర్మాణ పనుల్లో పురపాలక సంఘం ఎలాంటి జోక్యం చేసుకోదని వెల్లడించారు. బైపాస్ నిర్మాణంలో పట్టణ పరిధిలో అవసరమైన మేరకు మాత్రమే సంబంధిత నిర్మాణ సంస్థ పనులు నిర్వహిస్తుందని, అవసరమైన అదనపు పనులు మాత్రమే మున్సిపాలిటీ నిర్వహిస్తుందని వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణం నుంచి వెలువడే మురుగునీరు గణపవరం వాసులకు ఇబ్బంది లేని విధంగా కుప్పగంజి వాగులో కలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని చెప్పారు. తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు.

పీహెచ్‌సీలో ఎమ్మెల్యే తనిఖీ



వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో గల ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను శుక్రవారం శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యశాల్లో సిబ్బంది హాజరు పట్టికను, రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్ రెడ్డి విద్య, వైద్యమునకు అత్య .దికంగా నిధులు కేటాయించారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానము ద్వారా మారుమూల గ్రామస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించటం జరుగుతుందన్నారు. రూ. 57 కోట్ల రూపాయలతో నరసరావుపేటలోని వైద్యశాలను 400 పడకల వైద్యశాలగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుతాయన్నారు. రొంపిచర్ల వైద్యశాల్లో 19 రకాల వైద్య పరీక్షలతో పాటు 67 రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లి సుబ్బారెడ్డి మాతృమూర్తి రామతీర్థమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పచ్చవ రవీంద్ర బాబు, గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, విఆర్‌ఓ పడాల సుబ్బారెడ్డి, నాయకులు బీరం భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, వైద్యాధికారిణి డాక్టర్ స్వాతి, డాక్టర్ పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థులు సాధారణ డిగ్రీతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య తెలిపారు. కళాశాల గణిత శాస్త్ర విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ సహకారంతో శుక్రవారం కళాశాలలో ఆర్-ప్రోగ్రామింగ్‌పై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి దాదాపు 157 మంది విద్యార్థులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య మాట్లాడుతూ, కేవలం డిగ్రీతో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావటం లేదని ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే జీవితంలో ఎదగగలరని తెలిపారు. కాగా, సైన్స్ సిటీ సీఈఓ డాక్టర్ కె.జయరామి రెడ్డి వర్చువల్‌లో విద్యార్థులతో మాట్లాడి ఆర్-ప్రోగ్రామింగ్ ప్రాధాన్యతను వివరించారు. ఆరు దశలుగా కొనసాగిన వర్క్‌షాప్‌కు కె.ఎల్.విశ్వవిద్యాలయం గణాంక శాస్త్ర ప్రొఫెసర్ కె.రాజ్యలక్ష్మి రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.రమేష్, ఇంటర్మీడియేట్ ఇన్‌చార్జ్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలపై ఫిర్యాదు

క్షేత్రస్థాయిలో పరిశీలించిన లోకాయుక్త డీడీ

నాదెండ్ల: చందవరం గ్రామంలో గడిచిన నాలుగేళ్లలో జరిగిన పనుల్లో అవినీతి చోటు చేసుకుందని గ్రామానికి చెందిన యన్నం రమణారెడ్డి లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో లోకాయుక్త డీడీ సుబ్బారెడ్డి, స్థానిక అధికారులతో కలిసి గ్రామంలో రోడ్ల నాణ్యతను పరిశీలించారు. సుమారు రూ.4 కోట్ల మేర సీసీ రోడ్లు, కల్వర్టులు, పైపులైన్ల ఏర్పాటు, కాలువలు, సచివాలయం, రైతు భరోసాకేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ తదితర పనులు జరిగాయి. ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. ఆయనతో పాటూ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ఎల్ కాంతారావు, పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాసరావు, ఏఈలు రమణారెడ్డి, సూర్యతేజ, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వినుకొండలో పట్టపగలు చోరీ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల బజారులో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పట్టణానికి చెందిన ఎస్కే సుభాని కుటుంబ సభ్యులు వ్యక్తిగత పనులపై బజారుకు వెళ్లగా మేడపై నుంచి ఇంట్లోకి ప్రవేశించిన దొంగలు బీరువా తలుపులు పగలగొట్టి సుమారు రూ.3 లక్షల విలువ చేసే ఆభరణాలను దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: వాసవీ క్లబ్ గ్రేటర్ రీజియన్ చైర్మన్ పల్లపోతు ప్రకాశరావు నరసరావుపేట పర్యటనలో భాగంగా శుక్రవారం పేద విద్యార్థికి రూ.22వేలు ఆర్థిక సహాయం అందించారు. సత్తెనపల్లిరోడ్డులోని వాసవీ మినీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినుకొండ మండలం పాత గోకనకొండ గ్రామానికి చెందిన కొప్పురావూరి విజయభాస్కర్‌కు ఆర్థిక సహాయంతో పాటు స్కూల్ బ్యాగ్, దుస్తులు, దుప్పట్లును ప్రకాశరావు చేతుల మీదుగా అందించారు. అలాగే ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షుడు ఆత్మకూరి కోటేశ్వరరావు, కోశాధికారి మండవ శేషగిరిరావు, రీజియన్ సెక్రెటరీ తడవర్తి నాగరాజు, మునగాల చిరంజీవి, ఏవి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి



బోల్తా పడిన ట్రాక్టర్
మృతుడు షేక్ కరీంసా (ఫైల్)

రొంపిచర్ల : వేగంగా వస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని మునమాక గ్రామంలో శుక్రవారం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన షేక్ కరీంసా (38) ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. ఆ గ్రామానికి చెందిన రైతుల పొలాలను ట్రాక్టర్ తో దున్ని ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో గల కొండకావూరు కాలువ మేజర్ వద్దకు రాగానే అదుపుతప్పి కాలువలో దూసుకుపోయి బోల్తా పడింది. ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ కరీంసా (38) మీద ట్రాక్టర్ పడటంతో ఊపిరాడక అక్కడక్కడికే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాగా మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

కాపాడిన కారు బెలూన్లు!



ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన కారు

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. సకాలంలో కారులోని బెలూన్లు ఒక్కసారిగా ఓపెన్ కావడంతో కారులోని వ్యక్తి ప్రాణాలు నిలిచిన సంఘటన యడ్లపాడు మండలంలో బోయపాలెంలో శుక్రవారం జరిగింది. హైవే భద్రత అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శికి చెందిన షేక్ షరీఫ్ శుక్రవారం వ్యక్తిగత పనిపై కారులో విజయవాడకు బయలు దేరాడు. మండలంలోని బోయపాలెం 16వ జాతీయ రహదారి హైవే వంతెనపైకి రాగానే ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో షరీఫ్ ప్రయాణిస్తున్న కారు ముందుగా భాగం పూర్తిగా ధ్వంసమైంది. వెంటనే కారులోని బెలూన్లు ఓపెన్ కావడంతో షరీఫ్‌కు ప్రాణాపాయం తప్పి చెయ్యి విరిగింది. గాయాలైన షరీఫ్‌ను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

చెట్టు కొమ్మలు నరుకుతూ..



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బోయిన రాము

యడ్లపాడు: మండలంలోని కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలోని ఓ మామిడి తోటలో చెట్టు కొమ్మల్ని కొడుతున్న కూలీకి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..కొత్తపాలెం గ్రామానికి చెందిన 8 మంది కూలీలు మామిడితోటల్లో చెట్ల కొమ్మల్ని తొలగించడానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో బోయిన రాము కూలీలతో కలిసి కొమ్మలు నరికేందుకు మామిడి చెట్టు ఎక్కాడు. చెట్టు కొమ్మను కొట్టగా అది 11 కేవీ తీగలపై పడింది. దానిని తొలగించేందుకు రాము ప్రయత్నించడంతో తీగల్లో విద్యుత్ సరఫరా ఉండటంతో షాక్‌కు గురయ్యాడు. గమనించి తోటి కూలీలు కర్రలతో కొట్టి షాక్ నుంచి విడిపించారు. వెంటనే ఫిరంగిపురం మండలంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తరలించారు. ప్రస్తుతం ప్రాణాపాయం లేదని, నెలరోజుల పాటు విశ్రాంతి అవసరం ఉంటుందని వైద్యులు చెప్పినట్లు వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని అన్ని సచివాలయాల్లో శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక - సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్ తెలిపారు. మండల పరిధిలో 9247 మందికి గాను రూ.2,55,10,250లు పింఛను సొమ్ము పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పంపిణీ చేయనున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

నరసరావుపేట రూరల్: మండలంలోని రంగారెడ్డిపాలెంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సివిజన్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చెంచిరెడ్డి, డాక్టర్ హేమంత్‌సాయి శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

చనిపోయిన కార్మికుల పిల్లల పేర్లను ఆప్కాస్‌లో చేర్చండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు

నరసరావుపేట: పురపాలక సంఘంలో పనిచేస్తూ చనిపోయిన కార్మికుల పిల్లల పేర్లను ఆప్కాస్‌లో చేర్చాలని కార్మికులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పల్నాడు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ జి.రామ్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్మికులకు ఈఎస్ఐ కార్డులు ఇవ్వాలని, కొబ్బరినూనె, చెప్పులు, సబ్బులు ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని, అందరికీ ఆప్కాస్ నెంబరుతో ఐడీ కార్డులు ఇవ్వాలని, పనిముట్లు, రక్షపరికరాలు ఇవ్వాలని, 21వేల కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిలార్ మసూద్, టి.మల్లయ్య, యోహాను, పిట్టా ఏసు, సాల్మాన్ పాల్గొన్నారు.

ముగిసిన అంకమ్మతల్లి కొలుపులు



నాదెండ్ల: గణపవరం గ్రామంలో సింగు వారి ఇలవేల్పు అంకమ్మ తల్లి వార్షిక కొలుపులు శుక్రవారంతో ముగిశాయి. గత మూడు రోజులుగా ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. తొలిరోజు అమ్మవారిని చీరాల తరలించి సముద్ర స్నానం అనంతరం పుట్టలో ఏర్పాటు చేశారు. రెండో రోజు అమ్మవారి కళ్యాణం, మాత తడుపులు, వసంతోత్సవం నిర్వహించారు. చివరిరోజు శుక్రవారం అమ్మవారికి పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని సింగు వారు బోనాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన పట్టణంలోని మార్కాపురం రోడ్డులో గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. సేకరించిన సమాచారం ప్రకారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో ఈపూరు మండలం అగ్నిగుండాల గ్రామానికి చెందిన మీరావలి (40)కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మీరావలికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. ఈ సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తునారు.



